
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
3
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025



ముగిసిన ఓపెన్‌స్కూల్ దరఖాస్తుల స్వీకరణ

గద్వాల సర్కిల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) టెన్త్, ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు స్వీకరణ గడువు ముగిసినట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ సునీతమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,040 ప్రవేశాల కోసం దరఖాస్తులు రాగా వాటిలో టెన్త్ ప్రవేశం కోసం 411 మంది, ఇంటర్ ప్రవేశం కోసం 629 మంది అభ్యర్థుల దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినట్లు ఆయన తెలిపారు. నేటి నుంచి 23వ తేదీ వరకు అపరాద రుసుముతో తెలంగాణ ఓపెన్ స్కూల్/మీసేవా/టీజీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెబ్బేరులో గంజాయి కలకలం

- హైదరాబాద్ నుంచి బెంగళూరుకు తరలిస్తున్న 4 కిలోల గంజాయి స్వాధీనం
- కర్ణాటకకు చెందిన మల్లేశ్ ప్రభును అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెబ్బేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం సాయంత్రం గంజాయిని పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. ఎస్‌ఐ గంగిరెడ్డి యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లేశ్ ప్రభు అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నాడనే సమాచారంతో పెబ్బేరు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు రెక్కీ నిర్వహించారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని దగ్గర ఉన్న బ్యాగును పరిశీలించగా 4 కేజీల గంజాయి లభ్యమైంది. మల్లేశ్ ప్రభు అతని స్నేహితుడు దిలీప్‌కాళీ ఇద్దరూ కలిసి మోహన్, అర్జున్ అనే వ్యక్తుల దగ్గర ఒడిషాలో గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరులో విక్రయించేవారు. గంజాయిని తీసుకొని ఇద్దరూ వస్తున్న క్రమంలో దిలీప్ కాళీ తనకు పని ఉందని మధ్యలోనే బస్సు దిగి వెళ్లాడు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పెబ్బేరు బస్టాండ్‌లో గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పర్యాటకులకు కనువిందు చేసిన పెద్దపులి

మన్ననూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ జంగల్ సఫారీ పర్యాటకులకు సోమవారం ఉదయం పెద్దపులి కనువిందు చేసింది. అక్టోబరు 1 నుంచి టైగర్ సఫారీ ప్రారంభించడంతో పర్యాటకులు నల్లమల సందర్శనకు భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులు ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూ పాయింట్‌కు సఫారీ వాహనంలో వెళ్తుండగా నిజాం బంగ్లా (షికార్‌ఘర్) వద్ద మట్టి రోడ్డుపై పెద్దపులి కనపించింది. దీంతో డ్రైవర్ సఫారీ వాహనాన్ని నిలిపివేశాడు. పెద్దపులి సంచరిస్తున్న దృశ్యాలను పర్యాటకులు వారి సెల్ ఫోన్‌లలో వీడియోలు తీస్తూ సంబురపడ్డారు. అదే పర్యాటకులకు సాయంత్రం కూడా పెద్దపులి కనిపించిట్లు అమ్రాబాద్ అటవీ డివిజన్ అధికారి (ఎఫ్‌డీఓ) రామమూర్తి ధ్రువీకరించారు.





సోమవారం ఉదయం నిజాం బంగ్లా వద్ద అడవిలో సంచరిస్తున్న పెద్దపులి

దేశంలో ప్రతీ చోట ఓటుచోరీ



సంతకాల సేకరణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

గోపాల్‌పేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతీ చోట బీజేపీ ఓటు చోరీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమాలపూర్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ హాజరై సంతకాలు సేకరించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశంలోనే ఓటు చోరీ చేసి మూడోసారి అధికారంలోని వచ్చిదని అన్నారు. ఎన్నికలు జరుగుతున్న బిహార్ రాష్ట్రంలో ఓట్లను బీజేపీ చోరీ చేస్తుందని రాహుల్ గాంధీ అధారాలతో నిరూపించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, రోహిత్, అక్షయ్, చరణ్‌రాజ్, శాంతన్న, హరిబాబు, ధర్మారెడ్డి, రాములు, రవి, కొండన్న, తదితరులు పాల్గొన్నారు.


వైభవోపేతంగా అమ్మవారి శోభాయాత్ర



సాతాపూర్ వీధుల్లో అమ్మవారి శోభాయాత్ర

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్‌లో సోమవారం రాత్రి అమ్మవారి శోభాయాత్ర వైభవోపేతంగా కొనసాగింది. విద్యుత్‌కాంతుల నడుమ మేళతాళాలతో కొనసాగిన అమ్మవారి యాత్ర గ్రామం వీధుల్లో నిర్వహించారు. ఈ యాత్రలో ఆర్యవైశ్య మహిళల ఆటపాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

రేపటి విచారణపై.. ఉత్కంఠ



- స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఉంటాయా? రద్దు చేస్తారా? ఇదే చర్చ
- అన్ని పార్టీల నాయకుల మదిలో కొత్త రిజర్వేషన్లు వద్దనే భావన
- రద్దయితే పాత రిజర్వేషన్లను కొనసాగించి.. పార్టీ పరంగా టికెట్లు
- కాంగ్రెస్ పార్టీ ఇస్తే.. ఇతర పార్టీలు ఆ ప్రకారమే కేటాయించే అవకాశం

మహబూబ్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రిజర్వేషన్లను ఖరారు చేసినప్పటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు, మూడో కేడర్ నాయకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నిశబ్దంగా ఉన్నారు. తాము అనుకున్న రిజర్వేషన్లు రాక కొందరు నాయకులు బాధపడుతుండగా, తమకు అన్యాయం చేశారని చెబుతున్న గ్రామీణ నాయకులను సముదాయించలేని స్థితిలో నియోజకవర్గ నాయకులు ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేయడం, అప్పటికే సిద్ధంగా ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడం చకచకా జరిగిపోయాయి. జీఓ ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయడం చెల్లదనే భావనతో కోర్టుకు వెళ్లగా, ఈ నెల 8న హైకోర్టులో విచారణ జరిగి.. ఏదో విషయం తేలు తుందని అంతా భావిస్తున్నారు.

ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ఉంటాయా? రద్దు చేస్తారా? అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఎలాగూ వాయిదా పడే ఎన్నికలనే అభిప్రాయానికి వచ్చిన కొందరు ఇప్పటికే గ్రామాల్లో హడావుడి లేకుండా స్తబ్దుగా వ్యవహరిస్తున్నారు. మరికొందరు ఎలాగూ ఎన్నికలు వస్తాయని దసరా నుంచి జోష్‌తో తిరుగుతున్నారు. కానీ గతంలో స్థానిక సం స్థల ఎన్నిల ముంగిట ఉన్నంత ఉత్సాహం మాత్రం ఎవరిలోనూ కనిపించడం లేదు. అన్ని పార్టీల నాయకుల్లో అసంతృప్తి తీవ్రంగా ఉంది. అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చిన వారు ఇదే కొనసాగాలని ఆశిస్తుండగా.. అనుకూలంగా రాని వారు మాత్రం రిజర్వేషన్లు మారాలని, అవసరమైతే పాతవి కొనసాగించాలని కో రుకుంటున్నారు.



రెండు విధాలా కసరత్తు..

ప్రస్తుతం రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో షెడ్యూల్ విడుదల కావడంతోపాటు పనులు కూడా చకచకా జరిగిపోతున్నాయి. అయితే బుధవారం కోర్టు వెలువరించే నిర్ణయం ఎలా ఉన్నా రెండు రకాలుగా ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయ కులకు సూచనలు అందాయి. ఒక వేళ రిజర్వేషన్లు కొత్తవి కొనసాగితే.. ఖరారైన కేటగిరీల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. మెజారిటీ రెండు, మూడో కేడర్ నాయకులకు

(మిగతా 4 లో..)

స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టు తీర్పు కీలకం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీసీల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే ఎంపిక



మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కోర్టు తీర్పు కీలకం కానుందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి మండలంలోని రాజపేట శివారులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. బీసీలను గందరగోళ పరిస్థితులకు గురి చేయడం పట్ల బీసీ నాయకులు స్పందించకుండా ఉండడం మంచిది కాదని అన్నారు. తొమ్మిదేళ్లలో పాన్‌గల్ జనరల్ స్థానాలలో ఎస్టీ బిడ్డను, వనపర్తి మునిసిపాలిటీలో బీసీ బిడ్డను అందలం ఎక్కించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి దక్కిందని అన్నారు. నియోజకవర్గంలో మెజార్టీ సీట్లు గెలుస్తామని నిరంజన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాను ప్రకాష్ రావు, విజయ్‌కుమార్, మతీన్, రఘువర్ధన్ రెడ్డి, రవి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తను చంపిన కోడలి అరెస్టు

- వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు 5

ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు 4



చేప పిల్లల పంపిణీ కష్టమే..

- ఇప్పటికే మూడుసార్లు టెండర్లు
- ముందుకురాని కాంట్రాక్టర్లు
- గత ఏడాది 1.93 కోట్ల చేప పిల్లలు
- ఈ ఏడాది లక్ష్యం 2.50 కోట్లు 5

చెరువులకు జలకళ

- నిండు కుండలను తలపిస్తున్న చెరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- మూగజీవాలకు తప్పిన నీటి ఎద్దడి
- సస్యశ్యామలం కానున్న పంటపొలాలు

గట్టు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరుణదేవుడు కరుణించడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గట్టు మండలంలోని ప్రధాన చెరువులతో పాటు కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. గతేడాది చెరువు కుంటల్లో నీరు సమృద్ధిగా లేకపోవడంతో అయకట్టు పొలాలు బీడుగా మారాయి. ఈ ఏడాది వర్షాలు చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వానాకాలంతో పాటు యాసంగి పంటలు కూడా పండుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గట్టు, మాచర్ల, సల్కాపురం, చెరువులకు కూత వేటు దూరంలో నెట్టెంపాడు ప్రధాన కాలువ పారుతున్నా చెరువులకు ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఈ చెరువులన్నీ వర్షపు నీటిపైనే ఆధారపడాల్సి ఉంది. ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు నిండటంతో సాగుతో పాటు మూగ జీవాలు తాగు నీటికి చింతించవలసిన అవసరం లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరుణదేవుడు కరుణించాడు



గతేడాది చెరువుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరక పోవడంతో ఆయకట్టు బీడుగా వదిలి వేశాం. ఈ ఏడాది వరుణ దేవుడు కరుణించడంతో గట్టు చెరువు పూర్తి స్థాయిలో నిండింది. ఈ ఏడాది రెండు పంటల కు నీరు పుష్కలంగా అందుతోందనే నమ్మకం కలిగింది.

- లక్ష్మీనారాయణ, గట్టు

యాసంగికి నీటి కొరత ఉండదు



ఈ ఏడాది చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో వానకాలంతో పాటు యాసంగి పంటలకు కూడా డోకా లేదు. గతేడాది చెరువుల్లో నీరులేక యాసంగి పంటలు చాలా తక్కువగా సాగు చేశాం. ఈ ఏడాది ఆయకట్టు సాగువిస్తీర్ణం పెరుగనున్నది.

- రమేశ్, ఆయకట్టు రైతు



అలుగు పారుతున్న గట్టు చెరువు

హైలెవల్ వంతెన నిర్మాణానికి అవాంతరాలెన్నో



అసంపూర్తిగా మిగిలిన హైలెవల్ వంతెన, నీటిలోనే వాగుదాటుతున్న మహిళలు

- నత్తనడకన దుందుభీ నదిపై వంతెన నిర్మాణం
- రెండేళ్లయినా పూర్తికాని పనులు
- ప్రతీ ఏటా వరదలతో అంతరాయం
- త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు

కల్వకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుందుభీ నదిపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి అవాంతరాలు వస్తున్నాయి. ప్రతీ ఏటా కురుస్తున్న వర్షాలతో దుందుభీ నది పారుతుడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రజల రవాణా సౌకర్యార్థం రెండేళ్ల కింద వంతెన నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభించారు. కానీ ఆ పనులు పిల్లర్ల వరకు చేపట్టి వదిలేశారు.

వంతెన పూర్తి అయితే..

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం రఘుపతిపేట-రామగిరి మధ్య దుందుభీ నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తియితే కల్వకుర్తి - నాగర్‌కర్నూల్ - అచ్చంపేట నియోజకవర్గాలకు దూరాభారం తగ్గనుంది. దుందుభీ నది పారుతుడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి విద్యార్థులు, రైతులు అవస్థలు పడుతున్నారు. నది ప్రవాహం కొంత తగ్గితే కాజ్‌వేపై రాకపోకలు కొనసాగుతున్నప్పటికీ కొన్నిసార్లు వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. కూలీకి వెళ్లే మహిళలు వాగు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పదించి వంతెన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

త్వరగా అందుబాటులోకి తేవాలి

దుందుభీ నదిపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. నది పారుతుడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పదించి రవాణా సౌకర్యం మెరుగుపరచాలి.

- వెంకటయ్య, రామగిరి

దేవాలయ భూమి స్వాధీనం



కబ్జా చేసిన భూమిలో నుంచి సామగ్రిని తీసుకెళ్తున్న రైతులు

లింగాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమైన దేవాలయ భూములను హైకోర్టు తీర్పుతో సోమవారం దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని కోమటికుంటలోని ఆంజనేయస్వామి దేవాలయానికి సర్వే నెంబరు 165లో 12.35 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి 8 మంది రైతులు ఆ భూమిని ఆక్రమించుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆలయానికి కౌలు కూడా చెల్లించడం లేదు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. ఆలయ కమిటీకి అనుకూలంగా కోర్టు గత నెల 25న తీర్పు ఇచ్చింది. దీంతో సోమవారం అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లుగౌడ్ గ్రామానికి వెళ్లి కోర్టు తీర్పును ఆక్రమణదారులకు చదివి వినిపించారు. దీంతో వారు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న డబ్బాలను, సామగ్రిని తీసుకొని ఖాళీ చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు.

ప్రధాన రహదారిపై
దిగబడిపోయిన బొలెరో



గుట్టలపల్లి, పల్మూరు గ్రామాల మధ్య రహదారిపై ఉన్న లోలెవల్ కాజ్‌వేపై దిగబడిన బొలెరో వాహనం టైరు

తాడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని గ్రామాల్లో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ప్రధాన రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. సోమవారం మండలంలోని పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై లోలెవల్ కాజ్‌వే ఉంది. ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రతినిత్యం కాజ్‌వేపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో కాజ్‌వే కింది భాగంలో పూర్తిగా మట్టి కొట్టుకుపోయింది. దీంతో బొలెరో వాహనం అటుగా వెళ్తున్న క్రమంలో కాజ్‌వేపై ఇరుక్కుపోయింది. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులను పరిశీలించి మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రైస్ మిల్లులో అగ్నిప్రమాదం

» రూ.20 లక్షల ఆస్తినష్టం



రైస్‌మిల్లులో కాలిపోయిన ప్యానల్ బోర్డు, ఇతర యంత్ర సామగ్రి

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని సోలిపూర్ గ్రామంలోని ఐశ్వర్య ట్రేడర్స్ రైస్ మిల్లులో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. మిషనరీ ప్యానెల్ బోర్డు పూర్తిగా దగ్ధమైంది. 2 మోటార్లు పాక్షికంగా కాలిపోయాయి. మిల్లులో నుంచి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు గమనించి మంటలను ఆర్పివేశారు. బియ్యం, ధాన్యం బస్తాలు యంత్రాలకు దూరంగా ఉండటంతో వాటికి మంటలు అంటుకోలేదు. ప్యానెల్ బోర్డులోని విద్యుత్ తీగలు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోవడం వల్లే ప్రమాదం సంభవించినట్లు మిల్లు యజమాని నందకిషోర్ తెలిపారు. మొత్తంగా రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ఈ విషయంపై సివిల్ సప్లై జిల్లా అధికారి కాశీనాథ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఐశ్వర్య ట్రేడర్స్ రైస్ మిల్లు ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను అప్పగించకపోవడంతో ఏడాదిగా డిఫాల్టర్‌గా ఉందని తెలిపారు. సంఘటన విషయం తమకు తెలియదని చెప్పారు.

ఇంటి తాళం విరగ్గొట్టి
బంగారం, వెండి చోరీ

మక్తల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని నగలు, నగదును దొంగలు దోచుకెళ్లారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని రహమానియా కాలనీలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. చిట్యాల గ్రామానికి చెందిన ఖాజామైనుద్దీన్ మక్తల్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం విరగ్గొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని 3 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40 వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

పొలం గట్ల పంచాయితీ

» ఇద్దరిపై కేసు నమోదు

వీపనగండ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో పొలం గట్ల పంచాయితీకి సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాని తెలిపారు. గ్రామానికి చెందిన దేవరపాగ రాముడు, దేవరపాగ నగిరే స్వామిల మధ్య పొలం గట్ల విషయంలో సోమవారం గొడవ జరిగింది. మాటామాటా పెరిగి ఒకరిపైనొకరు దాడి చేసుకున్నారు. ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి బస్టాండు ప్రాంగణంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారని సీఎంఎస్ ఇంటో సిస్టమ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి నర్సిములు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఏటీఎంలోకి ఇద్దరు వ్యక్తులు వచ్చి చోరీకి యత్నించారని, ఈ అంశాన్ని కమాండ్ కంట్రోల్ నుంచి సమాచారం అందించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

కార్తీక స్నానం పరమ పవిత్రం



శక్తిపీఠం అధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల క్షేత్రంలోని సప్త నది సంగమ కూడలిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

» ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి నుంచి పుణ్యస్నానాలు

» కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు కొనసాగింపు

నారాయణపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కార్తీక స్నానం పుణ్యప్రదం, అత్యంత పవిత్రమని హిందువుల విశ్వాసం. అశ్వయుజ శుద్ధ పౌర్ణమి నుంచి కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు, నెల రోజుల పాటు నదుల్లో పుణ్యస్నానాలు చేయడాన్ని వ్రతంగా ఆచరిస్తారు. మంగళవారం నుంచి ఈ వ్రతం ప్రారంభం కానున్నది. ఈ నెల రోజులూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తిపీఠం, సంత్ మర్ రామాలయం, బాలాజీ మందిర్, దత్త కృష్ణ మందిర్, అవధూత నరసింహ స్వామి మఠంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాల్లో వేకువ జామునే స్వామి, అమ్మవార్లకు కాకడా హారతి ఇచ్చి, విశేష పూజలు చేస్తారు. భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

సూర్యోదయం లోపు స్నానం

కార్తీక స్నాన వ్రతం ఆచరించే వారు సూర్యోదయం లోపు బ్రహ్మీ ముహూర్తంలో పుణ్య స్నానం చేయాలి. అనంతరం శైవ, వైష్ణవ దేవాలయాల్లో దీపారాధన చేయాలి. ప్రధానంగా ముత్తయిదువలు దీపారాదన చేసి ప్రదక్షిణలు చేస్తారు. నది తీరానికి వెళ్లి స్నానం చేసేందుకు వీలుకాని వారు ఇళ్లలోనే అభ్యంగన స్నానాలు చేయవచ్చని వేద పండితులు చెప్తున్నారు. ఈ వ్రత కాలంలో నదీ స్నానం విశిష్ఠమైనదని పురణాలు చెప్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కృష్ణానది ప్రవహిస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ వద్ద తుంగభద్ర నది పారుతోంది. నదిలో ప్రవాహనికి అభిముఖంగా పురుషులు, వాలు ముఖంగా స్త్రీలు స్నానం చేయాలి.

విశేష ఫలం



నెల రోజుల పాటు సూర్యోదయం లోపు బ్రహ్మీ ముహూర్తంలో కార్తీక స్నాన వ్రతం ఆచరించడం వల్ల విశేష ఫలం లభిస్తుంది. ఈ నెల రోజులు శక్తి పీఠంతో పాటు ప్రధాన ఆలయాల్లో వేకువ జామునే కాకడా హారతి ఇచ్చి, విశేష పూజలు కొనసాగుతాయి.

- ఊట్కూర్ విభావసు పురోహిత్, కృష్ణ యజుర్వేద పండితుడు, నారాయణపేట



పేట బాలాజీ మందిర్‌లో కొలువైన వేంకటేశ్వర స్వామి

ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని



కొల్లాపూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్ ,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ముఖ్యనాయకులు, ఆశావహులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. ఈ విషయాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. మెజార్టీ స్థానాల్లో జెండా ఎగరేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల వారీగా సర్పంచు, ఎంపీటీసీ, జడ్‌పీటీసీ స్థానాలకు పోటీలో ఉన్న ఆశావహుల పేర్లను సేకరించారు. ఒక్కో స్థానానికి ముగ్గురిని ఎంపిక చేసి, గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సందు రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తమటం శేఖర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మేకల శ్రీనివాస్ యాదవ్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు జలాలు శివుడు, జిల్లా కార్యదర్శి తిరుమల్ యాదవ్, పట్టణ అధ్యక్షులు కాడం శ్రీనివాస్, కొల్లాపూర్ రూరల్ అధ్యక్షుడు కేతూరి నారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

» బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపుగా రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ఫీజులు చెల్లించకుండా విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. బహుజన కళా వేదిక జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి శ్రీకాంత్, బీఎస్ఎఫ్ నాయకులు రాంచందర్, నాగరాజు, సురేష్, సిద్దు, సాయికుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా దక్కని పదోన్నతి

» ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆవేదన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతికి అన్ని అర్హతలు ఉన్నా, తనకు పదోన్నతి అందలేదని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు విద్యాశాఖలో పని చేసే కొందరే కారణమని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల పరిధిలోని అమిస్తాపూర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఎండీ అబ్దుల్‌ఖలీం ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన 1989లో స్పెషల్ డీఎస్సీ ద్వారా ఎంపికయ్యారు. 1991లో రెగ్యులర్ టీచర్‌గా అపాయింట్ అయ్యారు. అ తర్వాత పలు పాఠశాలల్లో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తించారు. సీనియారిటీ ప్రకారం 2024లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి లభించింది. అప్పట్లో వ్యక్తిగత సమస్యలతో పదోన్నతి వద్దని విద్యాశాఖ అధికారులకు లేఖ ఇచ్చారు. 2025, జూలై, ఆగస్టు మాసాల్లో ఆయనకు మరోమారు పదోన్నతి పొందేందుకు అర్హత లభించింది. కానీ విద్యాశాఖలోని కొందరు అతడికి పదోన్నతి రాకుండా అడ్డుకున్నట్లు సమాచారం. కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి బంధువు కొరకే ఆయనకు పదోన్నతి రాకుండా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1989 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు లభించాయి. ఎండీ అబ్దుల్‌ఖలీంకు మాత్రమే రాలేదు. ఈ విషయంపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్లో మాట్లాడారు. సీనియార్టీ జాబితా ప్రకారం తన పేరు సీరియల్ నెంబర్ ఒకటిగా ఉందని, ఆ తర్వాత ఉన్న ఇద్దరికి పదోన్నతి ఇచ్చారని, తనకు మాత్రం ఇవ్వకుండా పలు కారణాలు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను కలిసి మాట్లాడితే, అందరికీ ఇచ్చినట్లుగా పాత డేట్‌లోనే పదోన్నతి ఇస్తామని చెప్తున్నారన్నారు. దీనికి సంబంధించిన ఫైల్ పెట్టాలని కింది స్థాయి సెక్షన్ సిబ్బందికి చెప్పి 15 రోజులైనా ఇప్పటికీ వారు స్పందించలేదని ఆరోపించారు.

తాను 2026 ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారని, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై డీఈవో కార్యాలయంలో సెక్షన్ సిబ్బందిని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించింది. ఉపాధ్యాయుడికి అన్యాయం జరిగింది వాస్తవమేనని వారు తెలిపారు. కొందరు స్వార్థం కోసం పదోన్నతిని అడ్డుకున్నారని చెప్పారు. దీనికి సంబంధించి డీఈవోను సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

» ఎఫ్‌డీవో రామమూర్తి



మన్ననూరులోని శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ ఉద్యోగులు

మన్ననూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్) ఎఫ్‌డీవో రామమూర్తి అన్నారు. 71వ ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో ఆధ్వర్యంలో మన్ననూరు డివిజన్ కార్యాలయం నుంచి దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు వరకు శ్రీశైలం - హైదరాబాద్ రహదారిపై ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అటవీ ఉద్యోగులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వారిని టైగర్ సఫారీ సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు ఎఫ్‌డీవో తెలిపారు. కార్యక్రమంలో మన్ననూరు రేంజ్ అధికారి వీరేశ్‌కుమార్, డీఆర్‌వో శ్రీకాంత్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై గొర్రెలు మృతి

తెలకపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని నడిగడ్డ సమీపంలో సోమవారం సాయంత్రం వాడల హనుమంతుకు చెందిన గొర్రెలను మేపుతూ రామగిరి గుట్ట దగ్గర కరెంటు బుడ్డి కింద ఉన్నందున 5 గొర్రెలు షాక్ తగిలి మృతి చెందినట్లు బాధితుడు వాపోయాడు. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం తను ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై అనేకసార్లు విద్యుత్ లైన్‌మన్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఇప్పుడు నా బాధ ఎవరికి చెప్పుకోవాలంటూ వాపోయాడు.

మద్యం బాటిళ్ల పట్టివేత : కేసు నమోదు

తాడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరులో పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా నాగర్‌కర్నూల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బస్తాలో ఆరు ఆఫ్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా సరే మద్యం, నగదును తరలించేందుకు ప్రయత్నించినట్లయితే అలాంటి వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపటి విచారణపై ఉత్కంఠ

(3వ పేజీ తరువాయి)

రిజర్వేషన్లు ప్రతికూలంగా ఉండటంతో ఇప్పుడు ఆయా గ్రామాలు, మండలాల్లో కొత్త అభ్యర్థుల కోసం వేట కొనసాగిస్తున్నారు. దాదాపు మెజారిటీ గ్రామాల్లో కొత్త రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగితే కొత్త ముఖాలు తెరపైకి రానున్నాయి. ఒకవేళ కోర్టు జోక్యం చేసుకుని జీఓ ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపు చెల్లదని, రాజ్యాంగం ప్రకారం 50 శాతం కంటే ఎక్కువ దాటొద్దని తీర్పు ఇస్తే మాత్రం.. ఇప్పటికే కాంగ్రెస్ ఎన్నికల్లో తమ పార్టీ బీసీ బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. పాత రిజర్వేషన్లు కొనసాగినప్పటికీ.. జనరల్ స్థానాల్లో బీసీలకు టికెట్లు కేటాయిస్తారు. అయితే గతంలో కూడా జనరల్ స్థానాల్లో ఉమ్మడి జిల్లాలో బీసీలు గెలిచిన సందర్భాలు చాలానే ఉన్నాయి. 42 శాతం కాకపోయినా దాదాపు 32 శాతం నుంచి 35 శాతం వరకు ఎంపీటీసీ, సర్పంచు స్థానాల్లో బీసీ అభ్యర్థులు గెలిచారు. అదే ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పోస్టుల్లో అంతగా బీసీలకు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈసారి అన్ని స్థానిక సంస్థల్లో ఇస్తారని చెబుతుండటంతో కొంత పరిస్థితి మెరుగు కావొచ్చు.

అన్ని పార్టీలదీ అదే మంత్రం..

గత ఎన్నికలను పరిశీలిస్తే ప్రధాన పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్యనే ఉన్నది. బీజేపీ పలుచోట్ల స్థానాలు గెలుచుకున్నా అంత ప్రభావం చూపించలేదు. అయితే ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ కూడా స్థానిక ఎన్నికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడం, ఆర్డినెన్స్ చట్టానికి ఆమోదం లభించకపోవడంతో జీఓ ద్వారా ఖరారు చేయడం జరిగిపోయాయి. దాని చుట్టూ జరుగుతున్న రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్ అవసరమైతే పార్టీపరంగా నైనా బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ఒకవేళ కాంగ్రెస్ ఆ ప్రకారం చేస్తే బీఆర్ఎస్, బీజేపీ కూడా అదే విధానాన్ని అనుసరించే అవకాశం మాత్రం కచ్చితంగా ఉంటుంది. ఒకవేళ అవి ఇవ్వకపోతే స్థానిక ఎన్నికల్లో బీసీ నినాదమే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ తాను ఇచ్చిన అవకాశాన్ని తమ అభ్యర్థుల విజయం కోసం అందిపుచ్చుకుంటుందని చెప్పొచ్చు. కాబట్టి అన్ని పార్టీలు కూడా తమ వ్యూహాలకు అనుగుణంగా 40 నుంచి 42 శాతం కచ్చితంగా బీసీలకు టికెట్లు ఇస్తాయని చెప్పవచ్చు. అలాగే బీసీలకు ప్రాధాన్యం పెరిగితే ఆయా సామాజిక వర్గాల్లో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

బీజేపీలో కాంగ్రెస్ నాయకుల చేరిక



బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండల పరిధిలోని కన్యతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీజేపీలోకి చేరారు. రాము, విక్రమ్, రాందాస్, శంకర్, గణేష్, సౌమ్య, అంజి, లక్ష్మణ్, యోగి తదితరులు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పి.మంగ్యానాయక్, ధర్మనాయక్, ఎం.శివకుమార్‌నాయక్‌లు పాల్గొన్నారు.

'ఏకగ్రీవం చేస్తే ఆలయానికి రూ.10 లక్షల విరాళం'

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆలయానికి రూ.10 లక్షల విరాళం అందిస్తానని జడ్చర్ల మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన తుడుం లక్ష్మమ్మ వెల్లడించింది. అందుకు సంబంధించిన మెసేజ్ సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చర్లపల్లి గ్రామ పంచాయతీకి ఎస్సీ మహిళగా రిజర్వేషన్ వచ్చిందని, ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.10 లక్షలు ఆలయానికి ఇవ్వడానికి సిద్దంగా ఉన్నానంటూ ఆ మెసేజ్‌లో పేర్కొంది. గ్రామాభివృద్ధితో పాటు గ్రామస్థులకు సహాయ, సహకారాలు అందించడానికి ముందుంటానని పేర్కొంది. అలాగే జడ్చర్ల మండలం గంగాపురం గ్రామ సర్పంచ్ జనరల్ స్థానానికి కేటాయించారు. ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు ఇస్తానంటూ గ్రామానికి చెందిన రఘురాంరెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం మండలంలో ఈ రెండు మెసేజ్‌లు సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతున్నాయి.

ఉమ్మడి పాలమూరు
జిల్లాలో భారీ వర్షం

» పాన్‌గల్ మండలంలో 72.6 మి.మీ. వర్షపాతం



రాజనగరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోనే దాటుతున్న వాహనదారులు

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట/వనపర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో సోమవారం తెల్లవారుజామున మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. 4 గంటల సమయంలో కురిసిన ఈ వర్షం భారీగానే నమోదైంది. వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలోని జగత్‌పల్లి వద్ద వాగుపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల సూచన మేరకు రాజనగరం స్టేజీ నుంచి ఆ గ్రామం గుండా పెద్దమందడికి వెళ్లేలా వాహనదారులను మళ్లించారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 72.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఖిల్లా ఘణపూర్‌లో 58.2, వనపర్తి 52.6, వీపనగండ్ల 43.2, రేవల్లి 35.6, గోపాల్‌పేట 22.4, శ్రీరంగాపూర్‌లో 1.1 మి. మీ వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 53 మి.మీ. వర్షపాతం నమోదైంది. జడ్చర్లలో 28 మి.మీ. రాజాపూర్‌లో 20, కోయిలకొండలో 13 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలంలో 45.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మద్దూర్ మండలంలో 14.8, కోస్గి మండలంలో 13.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలో 22.6 మిల్లీ మీటర్ల వర్షం కురువగా కోడేరు మండలంలో 20.9, పదరలో 16.1, కొల్లాపూర్‌లో 13.7, వెల్దండలో 10.8 మి.మీ. వర్షం నమోదైంది.

పోలీసు విధులకు ఆటంకం

» ముగ్గురి అరెస్ట్, రిమాండ్

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల క్రాస్‌రోడ్డు సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, సలీమ్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో వల్లూర్ శ్రీకాంత్, బద్రి, పానుగంటి బాబుతో పాటు మరికొంత మంది పగులగొట్టిన బీరు సీసాలను పట్టుకుని గొడవలు చేశారని, గొడవ చేయవద్దంటూ సూచించిన తమపై పరుష పదజాలంతో దూషించి, విధులకు ఆటంకం కలిగించారని కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసి, జడ్చర్ల కోర్టులో హాజరుపరిచామని, అనంతరం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివ

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, పలువురికి గాయాలు

కోడేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని పసుపుల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ జగదీశ్వర్ కథనం ప్రకారం... పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన నడిమింటి భరత్ (39) ఆదివారం సాయంత్రం కోడేరు మండలంలోని పసుపుల గ్రామానికి వచ్చాడు. అక్కడ కల్లు కొనుగోలు చేసి, అదే గ్రామానికి చెందిన బాలిక అంజలితో కలిసి స్వగ్రామానికి బయలు దేరాడు. పసుపుల శివారులో రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలిక సురక్షితంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన చేరుకొని, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య నడిమింటి స్వాతి ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో, కారు ఢీ, డ్రైవర్‌కు గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో గాయపడిన దాసరి అంజయ్య

మిడ్జిల్ (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రం సమీపంలో కారు, ఆటో ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు. ఎస్ఐ శివనాగేశ్వర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన గడ్డంపల్లి ప్రవీణ్‌రెడ్డి సోమవారం తన కారులో వెలిజాల నుంచి మిడ్జిల్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో మిడ్జిల్ నుంచి వెలిజాల వైపు వెళ్తున్న ఆటో, ప్రవీణ్‌రెడ్డి కారును ఢీకొన్నది. దీంతో ఆ కారు ముందున్న మరో ఆటోను ఢీకొన్నది. దీంతో ఆ ఆటో డ్రైవర్, కల్వకుర్తి పట్టణానికి చెందిన దాసరి అంజయ్య కాలుకు గాయాలయ్యాయి. అతడిని స్థానికులు మిడ్జిల్ ఆస్పత్రికి తరలించారు. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ప్రవీణ్ క్షేమంగా బయటపడ్డాడు. మొదటి ఆటో డ్రైవర్ ఆంజనేయులు గౌడ్‌కు కూడా ఎటువంటి గాయాలూ కాలేదు. సంఘటనపై ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

భూత్పూర్ (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లని బనియన్, నల్లని ప్యాంటు ధరించిన ఓ వ్యక్తి కాలినడకన భూత్పూర్ వైపు నుంచి జడ్చర్లకు వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎల్అండ్‌టీ, టోల్ ప్లాజా సిబ్బంది వెంటనే స్పందించి, అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉన్నది.


రోడ్డు ప్రక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి

షెడ్డులోకి దూసుకెళ్లిన డీసీఎం

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పిన డీసీఎం ఓ గుడిసెలోకి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. 44వ జాతీయ రహదారికి పక్కనే ఉన్న శ్రీవరసిద్ధి వినాయక కాటన్‌మిల్లు ముందున్న ఓ షెడ్డులో ఆదివారం అర్ధరాత్రి తర్వాత 12 మంది కూలీలు నిద్రపోయారు. కడప నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న ఓ డీసీఎం డ్రైవర్ నిద్రమత్తులో వాహనాన్ని అజాగ్రత్తగా, వేగంగా నడపుతూ కూలీలు నిద్రిస్తున్న షెడ్డుపైకి దూసుకెళ్లింది. వారు పడుకున్న చోటుకు అడుగుదూరంలో నిలిచిపోయింది. దీంతో నిద్రపోతున్న కూలీలు ఒక్క సారిగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో ఇద్దరు కూలీలు వీరాసింగ్, భాగ్యమతి గాయపడ్డారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

గోపాల్‌పేట, అక్టోంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన పిచ్చుగుట్ల పరశురాములు (43) జీవాల మారుబేరం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి, భోజనం చేసి అరుగుపై నిద్రపోయాడు. అర్ధరాత్రి తర్వాత మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్య సువర్ణను అడిగాడు. పొద్దున్నే ఇస్తాను, పడుకోమని ఆమె చెప్పి ఇంట్లో నిద్ర పోయింది. ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేచేసరికి అతడు కనిపించలేదు. దీంతో కుమారుడు బాలకృష్ణ గ్రామంలో గాలించాడు. చివరకు ఊరి సమీపంలోని లక్ష్మీ సముద్రం చెరువు గట్టుమీద పరశురాములు చెప్పులు, దుస్తులు కనిపించాయి. సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, స్థానికుల సాయంతో చెరువులో గాలించినా, ఆచూకీ లభించలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందిని పిలిపించి, గాలించడంతో పరశురాములు మృతదేహం లభ్యమైంది. సంఘటనపై భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపారు.


పరశురాములు (ఫైల్)

భర్తతో గొడవ పడి మహిళ..

తిమ్మాజిపేట (ఆంధ్రజ్యోతి) : భర్తతో గొడవ పడి భార్య ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగమ్మ (47), ఆమె భర్త అంజనేయులు మధ్య ఇటీవల చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై ఆమె తమ్ముడు శివకుమార్ సోమవారం తిమ్మాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండల పరిధిలోని దొడ్డిపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్ఐ జనార్దన్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన శివకుమార్ (20) ఇటీవల ఇల్లు నిర్మించాడు. అలాగే ఓ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అందుకోసం చేసిన అప్పులను భరించలేక మనస్తాపం చెంది, ఈనెల 5న సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై అతడి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోటవేటర్‌లో పడి యువ రైతు దుర్మరణం

గోపాల్‌పేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోటవేటర్‌లో పడి యువ రైతు దుర్మరణం చెందాడు. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం కేతపల్లి గ్రామానికి చెందిన ఎజ్జు రాజ్‌కుమార్ (26), అదే గ్రామానికి చెందిన స్నేహితులు పరశురాముడు, సాయికృష్ణలతో కలసి మండలంలోని ఏదుట్ల గ్రామంలో, కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. అదివారం సాయింత్రం పరశురాముడు, రాజ్ కుమార్‌లు ట్రాక్టర్ తీసుకొని పొలానికి వెళ్లారు. పరశురాముడు ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా రోటవేటర్‌లో శబ్దం వచ్చి ఆగిపోయింది. దీంతో రాజ్‌కుమార్ రోటవేటర్ కిందకు వెళ్ళి బ్లేడ్లను సరి చేస్తుండగా, పరశురాముడు నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను ముందుకు కదిలించాడు. దీంతో రాజ్‌కుమార్ రోటవేటర్‌లో చిక్కుకొని మృతి చెందాడు. సంఘటనపై సోమవారం ఉదయం రాజ్‌కుమార్ తండ్రి అగ్గిరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేప పిల్లల పంపిణీ.. ఈ సారి కష్టమే!


నిండు నీటితో కళకళలాడుతున్న ధర్మాపూర్ చెరువు

- ఇప్పటికే మూడుసార్లు టెండర్లు
- ముందుకురాని కాంట్రాక్టర్లు
- గత ఏడాది 1.93 కోట్ల చేప పిల్లలు
- ఈ ఏడాది లక్ష్యం 2.50 కోట్లు


గత ఏడాది చెరువుల్లో ఉచిత చేపపిల్లలను వదులుతున్న మత్స్యకారులు (ఫైల్)

పాలమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కరువు తీరా వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండు నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకు వాటిల్లో చేప పిల్లలను వదల లేదు. దీంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది రెండు నెలలు ఆలస్యంగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించడంతో కాంట్రాక్టర్లు నాణ్యత లేని, చిన్న సైజు చేప పిల్లలను పంపిణీ చేశారు. దీంతో చేపలు సక్రమంగా ఎదగక మత్స్యకారులు నష్టపోయారు. ఈ ఏడాదైనా చేప పిల్లలను ముందుగా పంపిణీ చేస్తారనుకుంటే ప్రభుత్వం ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియనే పూర్తి చేయలేదు.

ఆలస్యమైతే నష్టం

ప్రతీ సంవత్సరం సాధారణంగా జూలై చివరి నాటికి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండుతాయి. అప్పుడు చేప పిల్లలను వదిలితే మంచిగా పెరుగుతాయి. వేసవిలో నీళ్లు అడుగంటే సమయానికి కిలో సైజుకు కూడా పెరుగుతాయని మత్స్యకారులు చెప్తున్నారు. కానీ చేప పిల్లల పంపిణీ ఆలస్యమైతే చేపలు సరిగా ఎదగక నష్టం వస్తుందని అంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మత్స్యకారుల సహకార సంఘాలు 218 ఉన్నాయి. వాటిల్లో 11,750 సభ్యులు ఉన్నారు. మత్స్యకార మహిళా సంఘాలు 21 ఉండగా, అందులో 792 మంది సభ్యులున్నారు. జిల్లాలో గత ఏడాది 1,091 చెరువులు, కుంటలతో పాటు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో దాదాపు 1,93,78,000 చేప పిల్లలను వదిలారు. ఈ ఏడాది జిల్లాలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో మొత్తం 2.50 కోట్లు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.75 కోట్లకు పైగా చేప పిల్లలను వదలాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు.

పూర్తి కాని టెండర్ల ప్రక్రియ

ఉమ్మడి జిల్లాలో జూన్, జూలై మాసాలతో పాటు, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు జల వనరులు నిండుగా కళకళలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 9వ తేదీన చేప పిల్లలను పంపిణీకి టెండర్లను ఆహ్వానించింది. అయినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. రెండో సారి కూడా అదే పరిస్థితి నెలకొన్నది. చివరికి 14వ తేదీన మరోసారి టెండర్లకు ఆహ్వానించగా కాంట్రాక్టర్లు ముందుకొచ్చారు. దీంతో చేప పిల్లల ను పంపిణీ చేస్తారని మత్స్యకారులు ఆశిస్తున్న తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడు దలయ్యింది. దీంతో పంపిణీ ప్రక్రియపై సందిగ్ధం నెలకొన్నది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి



ధర్మాపూర్ గ్రామ పరిధిలో ఐదు చెరువులున్నాయి. గత ఏడాది 80 వేల చేప పిల్లలను వదిలినం. ఈ ఏడాది చెరువులు నిండి రెండు సార్లు అలుగు పారింది. కానీ నేటికి చేప పిల్లలను పంపిణీ చేయలేదు. కనీసం ఇప్పుడు చేపటిచ్చినా, ఎంతో కొంత లాభపడతాం. ఈ విషయంపై పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సీజన్ ముగిసాక చేపపిల్లలు ఇచ్చినా ఫలితం ఉండదు.

\- బోలయాదయ్య, మత్స్యసహకార సంఘం ప్రధాన కార్యదర్శి, ధర్మాపూర్

25వ తేదీ నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

- 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- రోజూ ఒక సబ్జెక్టుపై గంట పాటు ప్రత్యేక బోధన


నారాయణపేట కస్తూర్బా పాఠశాలలో ప్రత్యేక తరగతికి హాజరైన విద్యార్థినులు

నారాయణపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఏ-1 పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు.

నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచనలతో జిల్లా విద్యాశాఖాధికారి గోవిందురాజులు ఆదేశానుసారం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, మోడల్ పాఠశాలలల్లో ప్రతి రోజు సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు ఒక సబ్జెక్టు చొప్పున ప్రత్యేక బోధన చేస్తారు. ఈ తరగతుల్లో సిలబస్ పూర్తి, పునశ్చరణతో పాటు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసారు. ఈ ప్రత్యేక తరగతులకు రోజు వారీగా ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు, ఏ సబ్జెక్టును బోధిస్తారు తదితర విషయాలను ఒక ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. జిల్లాలో 76 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 5,365 మంది, 11 కస్తూర్బా పాఠశాలల్లో 462 మంది, రెండు మోడల్ పాఠశాలల్లో 144 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు.

అత్తను చంపిన కోడలి అరెస్టు

- వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు


మృతురాలు దొడ్డి ఎల్లమ్మ

వనపర్తి రూరల్/ రేవల్లి అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మందులకు, తిండికి, ఇతర ఖర్చులకు డబ్బులు అడుగుతోందని ఓ కోడలు అత్తపై దాడి చేసి, కొట్టి చంపేసింది. ఈ సంఘటన వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. సంఘటన వివరాలను వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర రావు వెల్లడించారు. గ్రామానికి చెందిన దొడ్డి ఎల్లమ్మ (75)కు, ఆమె కోడలు దొడ్డి బొగురమ్మల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మందు గోలీలకు, తిండికి, ఇతర ఖర్చులకు అత్త డబ్బులు అడుగుతోందని కోడలు బొగురమ్మ ఆమెపై కక్ష పెంచుకున్నది. ఆదివారం మరోసారి గొడవ కావడంతో ఎవరూ లేని సమయంలో ఆమె ఉంటున్న గదిలోకి వెళ్లి, కర్ర, ఇనుప పెంకుతో దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమె మంచం మీద పడిపోయి మృతి చెందింది. దీంతో బొగురమ్మ భయపడి మంచంపై, నేలపై పడిన రక్తం మరకలను తుడిచి ఏమీ తెలియనట్టుగా ఉండిపోయింది. అయితే వృద్ధాప్యం కారణంగా ఆమె చనిపోయి ఉంటుందని భావించిన కుటుంబసభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ఆమె వెన్నుపూస, తొడలపై గాయాలను గమనించి, బొగురమ్మను నిలదీయడంతో, ఆమె నేరాన్ని అంగీకరించింది. తరువాత ఆమె తన తల్లిగారి ఊరైన బిజినేపల్లి మండలంలోని గుడ్లనర్వకు పారిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం గుడ్లనర్వకు వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆమె నేరాన్ని అంగీకరించడంతో, ఇనుప పెంకు, కర్ర తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన వనపర్తి సీఐ కృష్ణయ్య, రేవల్లి ఎస్ఐ రజిత, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రామకృష్ణ, మౌలానాలను డీఎస్పీ అభినందించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య, ఎస్ఐ రజిత

మారని జనరల్ ఆసుపత్రి వైద్యుల తీరు

- ఎంఎల్‌సీ అయిన మృతదేహం బంధువులకు అప్పగింత
- తిరిగి ఆసుపత్రికి తెప్పించుకొని పోస్ట్‌మార్టం చేసిన వైనం


ఇంటివద్ద ఉన్న ఓంకార్ మృతదేహం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి వైద్యుల తీరు మారడం లేదు. గత నెల 12న జిల్లాకేంద్రంలోని కోయిలకొండ ఎక్స్‌రోడ్‌లో భిక్షాటన చేసే నిండు గర్భిణి మంగమ్మ కాన్పు కోసం ఆసుపత్రిలో చేరి ఓ బిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి రోజు ఆమె చనిపోయింది. అది ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) అయినా, ఆసుపత్రి వైద్యులు పోస్ట్‌మార్టం చేయకుండా మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఆ తర్వాత మృతదేహాన్ని మళ్లీ తెప్పించుకొని పోస్ట్‌మార్టం చేసి పంపించారు. ఇదే తరహాలో సోమవారం మరో సంఘటన జరిగింది. ఏనుగొండలో నివాసం ఉంటున్న ఓంకార్(38) అనే వ్యక్తి ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కిందపడి తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే చని పోయాడని వైద్యులు నిర్ధారించి, ఎంఎల్‌సీ చేశారు. బంధువులు కోరడంతో మృతదేహాన్ని వారికి అప్పగించారు. తీరా తప్పును తెలుసుకొని మృతదేహాన్ని ఇంటి నుంచి తెప్పించుకొని పోస్ట్‌మార్టం చేసి పంపించారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా, ఎంఎల్‌సీ చేసిన మాట వాస్తవమేనని, వారి బంధువులు పోస్ట్‌మార్టం వద్దని చెప్పడంతో, దాన్ని కొట్టివేసి మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ఉండవల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లా నీరు రోడ్డు మీదకు వచ్చి, బురద అవుతోందంటూ ఓ వ్యక్తి, మరో వ్యక్తిపై దాడి చేశాడు. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లికి చెందిన మంగలి వెంకటేశ్వర్లు, పింజరి హుస్సేన్‌ల మధ్య కొంత కాలంగా నల్లా నీరు రోడ్డుపైకి వస్తున్న విషయంపై తగాదా కొనసాగుతోంది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వెంకటేశ్వర్లు ఇంట్లో భోజనం చేస్తుండగా, పింజరి హుస్సేన్ వచ్చి గొడవకు దిగి, ఇటుకతో తలపై కొట్టడంతో గాయమైంది. సంఘటపై బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జరిమానా

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. జడ్చర్ల సీఐ కమలా కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మహబూబ్‌నగర్ మండలంలోని ఎదిర గ్రామానికి చెందిన విష్ణుకు మార్ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి, సోమవా రం జడ్చర్ల కోర్టులో హాజరు పరిచారు. అతడికి రూ.2వేలు జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల తీర్పు ఇచ్చినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

వనపర్తి రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పిన ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన వనపర్తి పట్టణంలో జరిగింది. వనపర్తి పట్టణ రెండో ఎస్ఐ శశిధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌కు చెందిన ముమ్మడి మౌనీషా వనపర్తిలోని ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటూ, ప్రైవేటు హాస్టల్లో ఉంటోంది. దసరా సెలవులకోసం గత నెల 29న తన స్నేహితురాలి గ్రామమైన జోగుళాంబ గద్వాల జిల్లా అనంతపూర్‌కు వెళ్లింది. అక్కడి నుంచి ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయింది.

కానీ మౌనీషా ఇంటికి చేరుకోకపో వడంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో విద్యా ర్థిని తల్లి ముమ్మడి సాయిలీల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల కబడ్డీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 8న ఎంపిక చేయనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా ప్రధాన స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలు 65 కిలోలు, బాలురు 70 కిలోల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 10వ తరగతి మెమో, ఆధార్, నాలుగు అర్హత పత్రాలతో, ఉదయం 9 గంటలకు కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కురుమూర్తిగౌడ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

జలమయమైన బాజీపూర్

- నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన ప్రజలు


భారీ వర్షానికి జలమయమైన బాజీపూర్

తిమ్మాజిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని బాజీపూర్ గ్రామం సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జలమయమైంది. మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగించే వెంకటయ్య (55) అనే వ్యక్తి పనులు ముగించుకుని వట్టెం వెళ్తున్న సమయంలో గొల్లోనిబావి సమీపంలో వరదప్రవాహం దాటుతుండగా కొట్టుకుపోతున్న అతనిని బాజీపూర్ ప్రజలు ధైర్య సాహసాలతో కాపాడారు.

కోనేరులో పడి యువకుడి గల్లంతు


గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్న జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది

జడ్చర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పడి పట్టణానికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి గల్లంతైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్రవీణ్ మద్యం మత్తులో కోనేరు వద్దకు వెళ్లి.. చెప్పులు, షర్ట్‌ను కోనేరుపై భాగంలో వదిలాడు. ఇదే సందర్భంలో కోనేరులో నుంచి బయటికి రావాలంటూ వరుసకు కుమారుడైన యువకుడు సూచించి, అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. కొంత సమయం తర్వాత చూడగా చెప్పులు, షర్ట్‌ను వదిలిన స్థానంలో ఉండడం, వ్యక్తి కనిపించకపోవడంతో కోనేరులో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది లీడింగ్ ఫైర్‌మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ సురేశ్, ఫైర్‌మన్‌లు ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి గల్లంతైన వ్యక్తి కోసం పాతాళకొండి సహాయంతో సాయంత్రం గాలింపు చేపట్టినా.. ఫలితం లేకపోవడంతో తాత్కాలికంగా విరమించారు. కాగా కోనేరులో రాళ్లు, చెట్లు ఉండడంతో కొంత అడ్డంకిగా మారింది. గాలింపు చర్యలను డీఎఫ్‌వో కిశోర్, జడ్చర్ల ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఎఫ్‌వో మల్లికార్జున్ పరిశీలించారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం పట్టివేత

ఉండవల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని చిన్న ఆముదాలపాడులోని ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉండవల్లి ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. దుకాణంలో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసి తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు తన కిరాణా షాపులో నిల్వ చేసిన 10.35 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.9,040గా అంచనా వేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇంటర్వ్యూ

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



» శంషుద్దీన్, ఎస్ఐ చారకొండ

చారకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయని సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

● ఎలాంటి శిక్షలు పడుతున్నాయి?

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడే వ్యక్తులకు కోర్టు జైలు శిక్షలు విధిస్తుంది. సానుకూల దృక్పథంతో కొన్నిసార్లు జరిమానాలు వేసి హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు రాకపోవడంతో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులకు సంబంధించి జైలు శిక్షలే ఎక్కువగా పడుతున్నాయి.

● రోడ్డు భద్రత కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్డు భద్రత కోసం ప్రతీ రోజు సాయంత్రం ప్రధాన రహదారిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారులు సీట్‌బెల్టు, హెల్మెంట్ ధరించి వాహనాలను నడపాలని సూచిస్తున్నాం. వాహనదారులు తమ వెంట వాహనాలకు సంబంధించి పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలి.

● సీసీ కెమెరాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారా?

నేరాల నియంత్రణలో మండలంలోని చారకొండ, మర్రిపల్లి, సిరసనగండ్ల, అయోధ్యనగర్ (గుట్ట) శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి.

● యువత చెడు మార్గాలకు పోకుండా చర్యలు తీసుకుంటున్నారా?

మండలంలో యువత చెడు మార్గాలు అనుసరించకుండా యువకుల్లో ఉత్సాహాన్ని నింపి వారు ఉన్నత స్థాయిలో ఎదిగే విధంగా కృషి చేస్తున్నాం. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

సంఘ సేవకునికి సత్కారం



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న సుధాకర్‌రావు

వంగూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మాపూర్ మాజీ సర్పంచ్, రిటైర్డ్ అధికారి సుధాకర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఐదు దశాబ్దాల సంఘసేవను గుర్తిస్తూ అమెరికన్ టెక్సాస్ యూనివర్సిటీ ఇచ్చిన గౌరవ డాక్టరేట్‌ను సుధాకర్‌రావు అందుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావును అభినందించారు. గౌరవ డాక్టరేట్ దక్కుంపట్ల ఆ గ్రామస్థులు ఈ సందర్భంగా సుధాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కందనూలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలో (విశ్వవాసు సంవత్సర ఆశ్వీయుజ మాసం పౌర్ణమి సందర్భంగా) ఈనెల 7న మంగళవారం ఉదయం 10:30గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. మంగళవారం ఆశ్వీయుజ మాసం పౌర్ణమి కావడంతో శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతాలు సామూహికంగా ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిత్య విష్ణు సహస్ర పారాయణ కమిటీ సభ్యులు, సత్యసాయి సేవా సమితి, రామాలయ భజన మండలి, శ్రీరామ యూత్ రామాలయ మహిళా సభ్యులచే ప్రత్యేకంగా సామూహిక భజనలు ఉన్నాయన్నారు.

ఎస్సీ, బీసీలకు న్యాయం చేయాలని వినతి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్వకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవ ల ప్రకటించిన రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, బీసీ కులాలకు అన్యాయం జరిగిందని తర్నికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సో మవారం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఇప్పటి వరకు ఎస్సీలకు, బీసీలకు గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ రాలేదని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసి న వారిలో స్థానిక నాయకులు సురేష్, గొరటి శ్రీనివాసులు, దేవయ్యలు ఉన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

» పట్టించుకోని అధికారులు



పశువుల సంత దగ్గర లీకేజ్ అవుతున్న మిషన్ భగీరథ నీరు కుంటగా మారిన దృశ్యం

రోడ్డుపై పారుతూ..

తెలకపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలకపల్లి మండలంలో మిషన్ భగీరథ పథకం పైపులైన్ లీకేజీల ద్వారా తాగునీరు వృథాగా పోతున్నది చాలా కాలంగా నీటి వృథా కొనసా గుతున్నది. తెలకపల్లి మండల కాంప్లెక్స్ పశువుల సంత దగ్గర, అదే విధంగా పర్వతాపూర్ క్రాస్ రోడ్ దగ్గర, సిమెంట్ బ్రిక్ తయారీ కేంద్రం వద్ద, తెలకపల్లి నుంచి రాకొండ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మిషన్ భగీరథ పథకం పైప్ లైన్లు పలుచోట్ల లీకేజీలు కొనసాగుతున్నాయి. ఫలితంగా తాగునీటి వృథా కొనసాగుతూ మడుగులుగా ఏర్పడ్డాయి.

చిన్న ముద్దునూరు, అనంతసాగర్ గేటు తదితర పైపులైన్ లీకేజీలతో ఎంతో కాలంగా కొనసాగుతున్నా.. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతు చేపట్టి శుద్ధ జలాల వృథాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దంచి కొట్టిన వర్షం

» గంటపాటు కురిసిన వర్షం

» పొలంలో మొక్కకే తడిసి ముద్దవుతున్న పత్తి



సిర్సవాడలో కురుస్తున్న భారీ వర్షం

తాడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాపగల్, సిర్సవాడ, భలాన్‌పల్లి, ఐతోల్, గోవిందాయపల్లి, ఎట్టిధార్‌పల్లి తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన పత్తి పంట పూర్తిగా పొలంలోనే మొక్కలకే ఉన్నందున అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిని ఉన్న సమయంలో ఉన్న కాస్తైనా తీసుకుందామనుకున్న సమయంలోనే అకాల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండాపోయింది.

మొత్తంగా కురిసిన వర్షంతో లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంగూరు మండల ముఖ్యనాయకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం మేరకు అభ్యర్థి గెలుపుకై పార్టీ కుటుంబ సభ్యులు ప్రతీ ఒక్కరు పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడకండని, రిజర్వేషన్లపై అపోహలు నమ్మవద్దు.. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, అల్వాల్ రెడ్డి, మల్లయ్య, సురేందర్ రెడ్డి, జంగయ్య, తిరుమలయ్య, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో స్పెషల్ చార్జీల వసూలు ఆపాలి

» బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పృథ్వీరాజ్

» నాగర్‌కర్నూల్ డిపో మేనేజరుకు వినతి



నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజరుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టీజీఆర్టీసీ రెగ్యులర్ బస్సుల్లో స్పెషల్ చార్జీలు వసూళ్లను ఆపాలని బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజరు యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పండగల సమయంలో ప్రయాణికుల మీద అదనపు చార్జీల భారం మోపడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండగల సందర్భంగా ప్రయాణికులు ఎక్కువగా ఉంటారని, దీనిని అదనుగా టికెట్ ధరలు పెంచి అమ్మడాన్ని బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దసరా పండగ పూర్తి చేసుకుని రెండు, మూడు రోజులు కావస్తున్నా నేటికీ ఆర్టీసీ అదనపు చార్జీలు వసూలు వసూలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్పెషల్ చార్జీల వసూళ్లను నిలిపివేసి ప్రజలపై పడిన భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు కళ్యాణ్, దాసు, భాస్కర్, రామకృష్ణ, రాంచందర్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో! ఆ గల్లీ...

» బస్టాండ్ ఎదురుగా ఉన్న రహదారి వెంట యథేచ్ఛగా వ్యభిచారం

» చోద్యం చూస్తున్న పోలీసులు » విటులను దోచుకుంటున్న

నాగర్‌కర్నూల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా వ్యభిచార కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఇందుకు లాడ్జిలు, తాత్కాలికంగా అద్దెకు తీసుకున్న గదులు కేంద్రంగా మారాయి. మద్యం మత్తులో మునిగి తేలుతున్న కొందరు వ్యభిచారినులు అందిన కాడికి దోచుకోవడం పరిపాటిగా మారింది. ఇందుకు జిల్లా కేంద్రం కేంద్ర బిందువుగా మారడం పోలీసులు కూడా పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున దుమారం రేకెత్తుతున్నది.

● ఆ రోడ్డంటేనే భయం....

బస్టాండ్ ఎదురుగా రామకృష్ణ టాకీస్ రోడ్డుకు వెళ్లే రహదారి వ్యభిచారానికి అడ్డాగా మారింది. ఇక్కడ మూడు లాడ్జిలు ఉన్నాయి. ఆధార్ కార్డులు ఉంటేనే లాడ్జిల్లో రూములు కేటాయిస్తామని చెప్పినా.. బలవంతంగా రూములు అద్దెకు తీసుకుని విటులను ఆకర్షిస్తున్నట్లు పోలీసులకు కూడా అనేక ఫిర్యాదులు ఉన్నాయి. విచిత్రమైన పరిస్థితేమిటంటే ఆ గల్లీ గుండా వృద్ధులు నడక సాగించాలంటే కూడా క్షేమంగా ఇంటికి చేరుతామా లేదా అనే అయోమయమైన పరిస్థితులు నెలకొన్నాయి.

● అక్కడంతా దోపిడే....

ఆ గల్లీలోకి వెళ్లాలంటే సామాన్య, మధ్య తరగతి జనం భయపడుతున్నారు. సామాన్యులు అనేక రకాలుగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రెండు రోజుల క్రితం తాడూరు మండలానికి చెందిన భార్యాభర్తలిద్దరూ ఆ గల్లీలో ఉన్న ఒక ఆసుపత్రి దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకుని వస్తుండగా ఒక మహిళ వారి దగ్గర ఉన్న 5390రూపాయలు నగదును తీసుకెళ్లడంతో పాటు ఉల్టాగా మాట్లాడడంతో ఆ గల్లీ నుంచి వెళ్లడానికి జనం జంకుతున్నారు. ఉదయం 9గంటల నుంచే విటులను ఆకర్షించేందుకు ఆ గల్లీ మొత్తం నిండిపోతుంది. అక్కడ చిరు వ్యాపారాలు చేసుకునే వాళ్లు హోటళ్ల నిర్వాహకులు మునిసిపాలిటీ, పోలీసులకు ఫిర్యాదు చేసినా చట్టబద్ధమైన చర్యలు లేకపోవడంతో ఇటీవల కలెక్టర్, ఎస్పీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి మండలం బెక్కర గ్రామానికి చెందిన చిన్న జంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం సమకూర్చారు. సోమవారం మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, ఉప్పల వెంకటేష్ సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దారమోని గణేష్, మాజీ సర్పంచ్ సుశీల, నాయకులు శేఖర్ రెడ్డి, బాలస్వామి, సాయిబాబు, జంగయ్య తదితరులున్నారు.

● పెద్దకొత్తపల్లి,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో బిజినేపల్లి రాముడు అనారోగ్యం రీత్యా ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబం నిరుపేద కావడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ ఆర్థిక సహాయాన్ని సోమవారం మృతుడి భార్య బాలీశ్వరమ్మకు అందజేశారు. అలాగే గ్రామ తాజా మాజీ సర్పంచ్ వి.సత్యం 50కేజీల బియ్యం అందజేశారు.

భూసమస్యలు పరిష్కరించాలి

తిమ్మాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న పలు భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్వేరో నెట్‌వర్క్ జిల్లా కో కన్వీనర్ గిద్ద విజయ్‌కుమార్ అన్నారు. తిమ్మాజీపేట మండల పరిధిలోని మరికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఉదయ్‌కుమార్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రామస్వామి, నాగయ్య, నరసింహ, నర్సోజి, శివాజీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

వంగూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలపై ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీవో బ్రహ్మచారి, తహసీల్దార్ మురళిమోహన్, మండల ప్రత్యేక అధికారి చంద్రకళ పాల్గొన్నారు. ఎన్నికల విధుల గురించి ఎంపీడీవో బ్రహ్మచారి వివరించారు. ప్రచార సందర్భంలో వాడే వాహనాలకు మైక్‌కి పర్మి షన్ ఉందా, లేదా చెక్ చేయాలని, పర్మిషన్ లేకుండా కటౌట్స్, ప్రచార సామగ్రి ప్రదర్శించరాదని తహసీల్దార్ మురళిమోహన్ వివరించారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ

తిమ్మాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ సోమవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, వంట గదిలో వంటకాలను పరిశీలించారు. విద్యకు సంబంధించిన పలు విషయాలను ప్రత్యేక అధికారి సుజాతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన భ వనాన్ని పరిశీలించి జరగాల్సిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

జీపీవోగా ఉమాదేవి బాధ్యతలు

ఉప్పునుంతల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొరటికల్ జీపీవోగా ఉమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకుడు వెంకట్ రెడ్డి, అచ్చంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి సన్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్ఏ చంద్రశేఖర్, కుర్మారెడ్డి, డీలర్ సత్యనారాయణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

తిమ్మాజీపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కాంగ్రెస్ నాయకుడు గోవింద్‌నాయక్ అన్నారు. తిమ్మాజీపేట మండల పరిధిలోని పుల్లగిరిలో ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. స్థానిక ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నాయకులతో కలిసి నిర్వహించారు. నాయకులు బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

ఉప్పునుంతల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే ప్రతీ కూలీకి ఆధార్ ఈకేవైసీ ఫోటోను సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీవో పర్వతాలు అన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉండి కూలీల ఫోటో అథెంటికేషన్ కచ్చితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మహిళల రక్షణే భరోసా సెంటర్ లక్ష్యం

» ఏఎస్పీ నోముల వెంకటేశ్వర్లు



భరోసా సెంటర్ సిబ్బందితో ఏఎస్పీ నోముల వెంకటేశ్వర్లు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణే భరోసా సెంటర్ లక్ష్యమని ఏఎస్పీ నోముల వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్‌లో చేపట్టే కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. బాధిత మహిళలను అందించే సేవలపై సిబ్బందితో చర్చించారు. కేసుల పరిష్కారంలో వేగం సమర్థత పెంచాలని సూచనలు చేశారు. భరోసా సెంటర్ సిబ్బంది మరింత సహాయ అనుభూతితో వ్యవహరించాలని పేర్కొన్నారు. సెంటర్‌లో రికార్డుల నిర్వహణ, బాధితుల గోప్యత కాపాడడంపై దృష్టి పెట్టాలన్నారు. భరోసా సెంటర్ ఎస్ఐతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం కార్యక్రమంలో నిర్వాహకులు

తెలకపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలేరులో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట కమిటీ, నాగర్ కర్నూల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలు పరిచయ, ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దశ అంటే పది అని రా అంటే నశింప చేయడం అని అర్థమని పేర్కొన్నారు. ఐదు కర్మేంద్రియాలను ఐదు జ్ఞానేంద్రియాలను యోగా మార్గంలో నశింప చేయడం అంటే మొత్తం పది ఇంద్రియాలను జయించడమే దశరా పండుగ యొక్క అర్థం అని అన్నారు. ఇది అందరూ తెలుసుకోవాలని గురువు గ్రంథాలలో రాశారన్నారు. అని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక-నాగర్ కర్నూలు, అచ్చంపేట కమిటీ అధ్యక్షులు, సభ్యులు మనోహర్ సాయి శంకర్, శ్రేష్ఠి నరసింహ, రమాదేవి, స్వప్న, మంజుల, శిరీష, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటతో స్థిరమైన ఆదాయం



ఆయిల్‌పామ్ పంట కొనుగోలు అగ్రిమెంట్ పత్రాలను అందజేస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ ఎం.లక్ష్మణ్

పెంట్లవెల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారి ఆయిల్‌పామ్ తోటను సాగు చేస్తే రైతుకు 40 సంవత్సరాల వరకు నెల నెలా స్థిరమైన ఆదాయం వస్తుందని కొల్లాపూర్ డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎం.లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోప్లాపూర్, సింగవరం గ్రామాల్లో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటను నాటిన నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం వస్తుందని వారు పేర్కొన్నారు. ఏడు సంవత్సరాల వరకు ఒక ఎకరానికి నాలుగు నుంచి అయిదు టన్నులు, సంవత్సరం తర్వాత 8 నుంచి 12 టన్నుల వరకు ఎకరానికి దిగుబడి వచ్చే అవకాశం ఉందని వారన్నారు. ప్రస్తుతం ఒక టన్ను ధర రూ. 19,400 ఉందన్నారు. చెట్టు పెరిగే కొద్దీ దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. గోప్లాపూర్, సింగవరం గ్రామాల్లో 2022 సంవత్సరంలో నాటిన రైతుల తోటను కోసినట్లు తెలిపారు. రైతులకు పంట కొనుగోలు అగ్రిమెంట్ పత్రాన్ని అందజేశామన్నారు. రైతులు విజయభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ గోబ్యాక్ ఉద్యమం జిల్లా అధ్యక్షుడిగా జయశంకర్



పిడమర్తి రవితో జిల్లా అధ్యక్షుడు జయశంకర్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం జిల్లా అధ్యక్షుడిగా వంగూరి జయశంకర్ నియామకమయ్యారు. సోమవారం హైదరాబాదులోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మార్వాడీ గోబ్యాక్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి చేతుల మీదుగా నియామక పత్రాన్ని జయశంకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థానిక వ్యాపారులను ప్రోత్సహిస్తూ మార్వాడీలు చేస్తున్న మోసాలను ఎండగడతానని పేర్కొన్నారు. త్వరలో మార్వాడీ గోబ్యాక్ జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించడమే స్వేరో లక్ష్యం



మాట్లాడుతున్న స్వేరో జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ

చారకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలను అధిరోహించడమే స్వేరో లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ, కో- కన్వీనర్ గిద్ద విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వేరో మండల అధ్యక్షుడు పసుల పాపయ్య అధ్యక్షతన మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి స్వేరో జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ, జిల్లా కో- కన్వీనర్ గిద్ద విజయ్‌కుమార్, స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు హాజరై మాట్లాడారు. జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ కృషి చేస్తుందని అన్నారు. బడుగు బలహీన, పేద విద్యార్థుల కోసం అక్షరమే ఆయుధంగా మలుచుకొని వారిని ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వేరో కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామని అన్నారు. రమేష్, రాంబాబు, రవి పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

కొల్లాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని కృష్ణానది తీర ప్రాంతమైన అమరగిరి గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా మండల ఎంఈవో ఇమ్మాన్యుయేల్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల ప్రతిభావళిని పరిశీలించారు. పుస్తక పఠనం, లెక్కలు, ఇంగ్లీష్ పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారితో సమాధానాలు రాబట్టారు. ఎంఈవో వెంట సీఆర్‌పీ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

● లింగాల: విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించే విధంగా ఉపాధ్యాయులు బోధించినప్పుడే విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు పొందవచ్చునని లింగాల మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల వారీగా తరగతి గదులను సంద ర్శించి విద్యార్థుల సామర్థ్యాలను,

ఠాకూర్ బాలాజీసింగ్‌కు మాతృవియోగం



సావిత్రిబాయి(ఫైల్)

కల్వకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబరు కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్‌బాలాజీసింగ్ తల్లి ఠాకూర్ సావిత్రిబాయి(78)సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇటీవలే ఆయన తండ్రి రతన్‌సింగ్ మృతి చెందిన విషయం తెలిసిందే. భర్త మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు లోనై అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

రాధాకృష్ణను పరామర్శించిన జర్నలిస్టులు

కందనూలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దళిత నాయకుడు ఎద్దుల రాధాకృష్ణను నాగర్‌కర్నూల్ జర్నలిస్టులు సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ జరిగింది. రాధాకృష్ణను నాగర్‌కర్నూల్‌లోని ఆయన నివాసంలో జర్నలిస్టులు అబ్దుల్లాఖాన్, జెమిని సురేష్, సురేష్‌రావు, రాజేష్‌గౌడ్, ఖానాపురం ప్రదీప్, మహమ్మద్ సాజిద్, బాలస్వామి, వెంకటేష్, మహమ్మద్ సాధిక్, జంగిటి రాజేష్, 19టీవీ శేఖర్, రాష్ట్ర దళిత నాయకుడు జెట్టి ధర్మరాజు తదితరులు ఆయనను పరామర్శించార